
ఆంధ్రజ్యోతి
andhrajyothy.com ఆదివారం ఉష్ణోగ్రత గరిష్ఠం 36.5, కనిష్ఠం 25.6

నిజామాబాద్
జిల్లా వార్తలు
5
సోమవారం 25 మార్చి 2024

రంజాన్ వేళలు

సోమవారం	మంగళవారం
ఇఫ్తార్ :	సహర్ :
సా. 6.34	ఉ. 4.54

ఇతరుల పట్ల మీకున్న ద్వేషానికి లోనై మీరు న్యాయాన్ని త్యజించకండి. న్యాయం చేయండి అది దైవభీతికి సమీపమైనది.





ఇఫ్తార్‌లో మాట్లాడుతున్న మంత్రి సీతక్క

మైనార్టీల సంక్షేమానికి కట్టుబడి ఉన్నాం

నిజామాబాద్ అర్బన్, మార్చి 24: రాష్ట్ర ప్రభుత్వం మైనార్టీల అభివృద్ధి సంక్షేమానికి కట్టుబడి ఉందని రాష్ట్ర మహిళా శిశుసంక్షేమ శాఖ మంత్రి సీతక్క అన్నారు. ఆదివారం నగరంలోని ధర్మపురి హిల్స్‌లో కార్పొరేటర్ అరోస్‌ఖాన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో ఆమె పాల్గొన్నారు. ఆమెతో పాటు రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ మైనార్టీ ప్రభుత్వ సలహాదారులు షబ్బీర్‌అలీ, ఉర్దూ అకాడమి చైర్మన్ తాహెర్ బిన్ హందాన్‌లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ముస్లీం మైనార్టీలకు అండగా ఉంటుందని ఆ దిశగా ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు.

నేడు మద్యం షాపులు బంద్

నిజామాబాద్ అర్బన్, మార్చి 24: జిల్లాలో హోలీ సందర్భంగా మద్యం, కల్లు దుకాణాలు సోమవారం మూసి ఉంచనున్నట్లు పోలీస్ కమిషనర్ కల్మేశ్వర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆదివారం సాయంత్రం 5గంటల నుంచి మంగళవారం ఉదయం 6 గంటల వరకు మద్యం షాపులు మూసిఉంచనున్నట్లు ఆయన తెలిపారు. కాగా, బహిరంగ ప్రదేశాల్లో ఇష్టం లేని వ్యక్తులు, స్థలాలు, వాహనాలపై రంగులు లేదా రంగు నీళ్లు చల్లడం, ప్రజలకు అసౌకర్యం కలిగించే విధంగా హోలీ వేడుకలు జరుపుకో వద్దని ఆయన తెలిపారు.

కొత్త కార్డులకు కోడ్ అడ్డంకి!



- నూతన రేషన్‌కార్డుల జారీకి పార్లమెంట్ ఎన్నికల కోడ్ అడ్డంకి
- ప్రభుత్వ సంక్షేమ పథకాలను కోల్పోతున్న పేదలు
- తొమ్మిదేళ్లుగా కొత్త రేషన్ కార్డులు లేవు
- కుటుంబ సభ్యులను జతచేసే దరఖాస్తులే 50వేల పైమాటే
- కొత్త రేషన్‌కార్డుల కోసం అర్హులకు తప్పని ఎదురుచూపులు

నిజామాబాద్ అర్బన్, మార్చి 24: కొత్తగా రాష్ట్రంలో ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం అర్హులందరికీ రేషన్ కార్డులు జారీ చేస్తామని ఎన్నికల్లో ఇచ్చిన హామీని నెరవేర్చుకునే దిశగా ప్రజాపాలన దరఖాస్తులను స్వీకరించింది. రేషన్ కార్డులు లేనివారు సైతం కొత్తగా దరఖాస్తు చేసుకోవాలని ప్రభుత్వం అవకాశం కల్పించింది. వేలాది మంది అర్హులైన పేదలు రేషన్ కార్డుల కోసం దరఖాస్తులు స్వీకరించినప్పటికీ కొత్త రేషన్ కార్డులు మాత్రం ఇంకా ప్రభుత్వం జారీ చేయలేదు. ఎంపీ ఎన్నికల కోడ్ రావడంతో కొత్త రేషన్ కార్డుల జారీ మరో మూడు నెలల పాటు పెండింగ్‌లో పడింది. దీంతో ప్రభుత్వం అమలు చేస్తున్న ఆరు గ్యారెంటీ పథకాలకు అర్హులైన చాలా మంది నష్టపోతున్నారు. ప్రభుత్వం ఆరు గ్యారెంటీ స్కీమ్‌లకు రేషన్ కార్డు తప్పనిసరి చేయడంతో చాలా మంది అర్హులు ప్రభుత్వ పథకాలను పొంద లేకపోతున్నారు. గతంలో తొమ్మిదన్నర ఏళ్ల పాటు కొనసాగిన బీఆర్ఎస్ ప్రభుత్వం రేషన్ కార్డుల జారీలో నిర్లక్ష్యం చేసింది. కేవలం ఒకసారి మాత్రమే రేషన్ కార్డులను జారీ చేయగా అవి కేవలం కాగితాలకే పరిమితం అయ్యాయి. ఎవరికి రేషన్ కార్డులను ఇవ్వలేదు. గత తొమ్మిదేళ్ల కాలంలో అనేక కుటుంబాలలో పిల్లలకు పెళ్లిళ్లు జరిగి వేరే కాపురాలు పెట్టినప్పటికీ వారికి రేషన్ కార్డులు అందలేదు. ఆడపిల్లలకు పెళ్లిళ్లు జరిగి అంతవారి ఇంటికి వెళ్లినప్పటికీ ఇక్కడ పుట్టినింట్లో ఉన్న రేషన్ కార్డులలో పేర్లు తొలగించారు. అత్తవారి ఇంట్లో వారి పేర్లను నమోదు చేయడంలో మాత్రం ఆలస్యం జరుగుతుంది. గత ఐదేళ్లుగా రేషన్ కార్డుల్లో కొత్తవారి పేర్ల నమోదు జరగడం లేదు. చిన్న పిల్లలు అంగన్‌వాడి పాఠశాలకు వెళ్లిన క్రమంలో వారి పేర్లను రేషన్ కార్డులో నమోదు చేయలేదు. ఇప్పుడు ఆ పిల్లలు పదేళ్ల నిండుతున్నా ఇంకా రేషన్ కార్డులో వారి పేర్లను నమోదు చేయకపోవడంతో వారంతా ఆహార భద్రత కార్డు కింద రేషన్ బియ్యాన్ని కోల్పోతున్నారు.

జిల్లాలో 3లక్షల 80వేల 48 ఆహార భద్రత కార్డులు

జిల్లాలో 3లక్షల 80వేల 48 ఆహార భద్రత కార్డుల ద్వారా ఇప్పటికే 12లక్షల 25,008 మంది లబ్ధిదారులకు అంత్యోదయ, అన్నపూర్ణ కార్డుల ద్వారా లబ్ధిదారులకు రేషన్ అందజేస్తున్నారు. జిల్లావ్యాప్తంగా 759 రేషన్ దుకాణాల ద్వారా రేషన్ సరకుల పంపిణీ కొనసాగుతోంది. జిల్లాలో అంత్యోదయ కార్డులు 20961 ఉండగా 56వేల 922 మందికి, 1034 అన్నపూర్ణకార్డుల ద్వారా 1057 మంది లబ్ధిదారులకు రేషన్ బియ్యం అందజేస్తున్నారు. వీరికి ప్రతి నెల ఒక్కొక్కరికి 6 కిలోల చొప్పున, అన్నపూర్ణ కార్డుదారులకు ఉచితంగా 10కిలోలు, అంత్యోదయ కార్డుదారులకు ప్రతి నెలా35 కిలోల బియ్యాన్ని అందజేస్తున్నారు.

పేదల ఎదురుచూపులు

గతంలో పదేళ్ల పాటు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వం కొత్త రేషన్ కార్డులను అందజేస్తామని ప్రకటించినప్పటికీ అది క్షేత్రస్థాయిలో అమలు కాలేదు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన కొత్తలో 2014లో అప్పటి ప్రభుత్వం సమగ్ర కుటుంబ సర్వే పేరుతో ఒకేరోజు సర్వే నిర్వహించి ఇంటింటి వివరాలను నమోదు చేసుకున్నప్పటికీ రేషన్ కార్డులను మాత్రం ఇవ్వలేదు. 2022లో కొంత మంది లబ్ధిదారులకు రేషన్ కార్డులను జారీ చేశారు. అవి కొంత మందికి మాత్రమే ఇచ్చారు. ప్రస్తుతం కుటుంబాలు పెరిగిపోయి విడిగా ఉంటున్న వారు, పెళ్లిళ్లు జరిగి వేరేకాపురం పెట్టి వారు, కొత్తగా పుట్టిన పిల్లలు, కొంత మంది పిల్లల పేర్లు రేషన్ కార్డులో లేకపోవడం వీటన్నింటికి అవకాశం లేకపోవడంతో ప్రభుత్వ పథకాలను కోల్పోతున్నారు. ఆరు గ్యారెంటీల అమలులో రేషన్ కార్డుల కీలకపాత్ర పోషిస్తున్నాయి. రేషన్ కార్డు ఉంటేనే ఆరు గ్యారంటీ స్కీమ్‌లకు అర్హులుగా ప్రభుత్వం ప్రకటించిన నేపథ్యంలో ఈ మూడు నెలల కాలంలో కొత్త రేషన్ కార్డులు ప్రభుత్వం జారీ చేస్తే బాగుండేదని లబ్ధిదారులు అభిప్రాయపడుతున్నారు. ప్రస్తుతం పార్లమెంట్ ఎన్నికల కోడ్ రావడంతో కొత్త రేషన్ కార్డులకు బ్రేక్ పడింది. మూడు నెలల పాటు ఎన్నికల కోడ్ అమలులో ఉండనున్న నేపథ్యంలో జూన్ తర్వాతనే కార్డుల జారీకి అవకాశం ఉంది.

ఫ్యామిలీ మెంబర్ యాడింగ్ దరఖాస్తులు 84,372 పెండింగ్

జిల్లాలో ప్రస్తుతం 3లక్షలకు పైగా ఉన్న రేషన్‌కార్డులలో సవరణలు, కుటుంబ సభ్యులను చేర్చడానికి లబ్ధిదారులు చేసుకున్న దరఖాస్తులు 84,372 పెండింగ్‌లో ఉన్నాయి. కుటుంబ సభ్యులు, పిల్లలు 5 సంవత్సరాలు నిండిన తర్వాత రేషన్‌కార్డులలో యాడ్ చేస్తుండడంతో కార్డుదారులు వారికి సంబంధించిన పత్రాలు పట్టుకుని కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఉంది. కొత్త రేషన్‌కార్డుల జారీని నిలిపివేసిన ప్రభుత్వం కుటుంబ సభ్యులు, పిల్లలను జతపరిచే ప్రక్రియను కూడా ఆలస్యం చేస్తుండడంతో ఆహార భద్రత కార్డుదారులు తీవ్రంగా నష్టపోతున్నారు. వారికి ఏదైనా ఆరోగ్య సమస్యలు వచ్చినపుడు ఆరోగ్యశ్రీలో వారి పేరు లేకపోవడంతో ఆసుపత్రులలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కార్యాలయాల చుట్టూ తిరిగిన కుటుంబ సభ్యులు, పిల్లలను జతపరిచే ప్రక్రియ జరగకపోవడంతో వారు ఇబ్బందులు పడుతున్నారు.





• నగరంలో ఆర్యసమాజ్ ఆధ్వర్యంలో కామదహనం..

ఘనంగా కామదహనం

- నేడు హోలీ సంబురాలు
- సామగ్రి కొనుగోళ్లతో మార్కెట్‌లో సందడి

నిజామాబాద్ అర్బన్, మార్చి 24: నగరంలో ఆదివారం రాత్రి కామదహన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. జిల్లాలోని పలు ప్రాంతాల్లో శనివారమే కామదహనం జరగగా ఆదివారం గ్రామీణ ప్రాంతాల్లో హోలీ వేడుకలు నిర్వహించారు. నగరంతో పాటు పలు పట్టణాల్లో కామదహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆదివారం సాయంత్రం ఆర్యసమాజ్ ఆధ్వర్యంలో పురోహితుల ద్వారా కామదహన కార్యక్రమాన్ని నిర్వహించారు. చందనాది సుగంధ ద్రవ్యాలు, మధురమలు, పుష్టికరములు, రోగనాశక ఔషధాలను ఉపయోగించి కామదహన కార్యక్రమాన్ని నిర్వహించారు. మొదట యజ్ఞం నిర్వహించి తర్వాత కామదహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆచార్య వేదామిత్ర వేదార్తి, ప్రణవకుమార హర్షకవి, బాబురావు, ప్రవీణ్, వినోద్, దాత్రిక రమేష్ తదితరులు పాల్గొన్నారు. నగరంలోని 45 ప్రాంతాల్లోని ప్రధాన కూడళ్లవద్ద ఈ కామదహన కార్యక్రమాన్ని నిర్వహించారు. మార్వడి సమాజ్ ఆధ్వర్యంలో క్లాక్ టవర్ వద్ద కామదహన వేడుకలు ఘనంగా నిర్వహించారు.

నేడు హోలీ..

జిల్లాలోని కొన్ని ప్రాంతాల్లో ఆదివారం కామదహనం కార్యక్రమం జరుగగా సోమవారం హోలీ వేడుకలు నిర్వహించనున్నారు. నిజామాబాద్ నగరంలో సోమవారం హోలీ నిర్వహించనున్నారు.



మార్కెట్‌లో విక్రయిస్తున్న హోలీ సామగ్రి, రంగులు







గ్రామీణ ప్రాంతాల్లో ఆదివారం హోలీ వేడుకలు ఘనంగా జరిగాయి. నగరంలోని రెండు మూడు చోట్ల హోలీ వేడుకలకు ప్రత్యేకంగా ఏర్పాట్లు చేశారు.

మార్కెట్‌లో హోలీ సందడి..

మార్కెట్‌లో హోలీ పండుగ సందడి నెలకొంది. చిన్న పెద్ద తేడా లేకుండా జరుపుకునే హోలీ పండుగ కోసం ఆదివారం గాంధీచౌక్, కుమార్‌గల్లి, పెద్ద బజార్, పూసలగల్లి మార్కెట్ ప్రాంతాలంతా రం గుల అమ్మకాల కొనుగోళ్లతో సందడిగా మారింది. రంగులు, వాటర్ గన్‌లు, కుడకలపేర్లు, చక్కెరపేర్లను కొనుగోలు చేశారు.



• అన్నారం నుంచి డొంకేశ్వర్ వెళ్లే మలుపు

ప్రమాదకర మలుపులు!

జిల్లాలో మూలమలుపులు మృత్యు పిలుపులుగా మారుతున్నాయి. మలుపుల వద్ద సూచిక బోర్డులు కానరాకపోవడంతో నిత్యం ఎక్కడో ఒక చోట రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. దీనికి ముఖ్యంగా అతివేగం, మద్యం తాగి వాహనాలు నడపడం ఒక కారణమైతే.. రహదారులపై ఉన్న మలుపుల వద్ద సూచిక బోర్డులు ఏర్పాటు చేయకపోవడం మరో కారణమని స్థానికులు పేర్కొంటున్నారు.

- మలుపుల వద్ద కానరాని సూచిక బోర్డులు
- అతివేగంతో అదుపు తప్పుతున్న వాహనాలు
- పట్టించుకోని అధికారులు

డొంకేశ్వర్, మార్చి 24: మండలంలోని వివిధ గ్రామాలకు వెళ్లే ప్రధాన రహదారులు వెంట ఉన్న మూలమలుపులు ప్రమాదకరంగా ఉండడంతో ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుందోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ప్రధానంగా మండలంలోని నికాల్‌పూర్, డొంకేశ్వర్, నూత్‌పల్లి, నడ్కుడ, మారంపల్లి, తొండాకూర్ తదితర గ్రామాల ప్రధానరహదారులపై మూలమలుపులు పొంచి ఉన్నాయి. ఈ రహదారులపై ప్రయాణం చేసేటప్పుడు ముందు నుంచి ఏ వాహనం వస్తుందో తెలియని పరిస్థితి నెలకొంది. ఇప్పటికే ఈ మార్గంలో పలు ప్రమాదాలు సంభవించాయి. మూలమలుపజుల వద్ద ప్రమాదాలు అవుతున్నాయి.

తరచూ ప్రమాదాలు..

మండల కేంద్రంలోని డొంకేశ్వర్ నుంచి అన్నారం వైపు వెళ్లే రహదారిలో తెప్పల మడుగు వద్ద మలుపు కానరాక ప్రమాదం సంభవించి ప్రాణాలు కోల్పోయారు. గత కొద్ది రోజుల క్రితం ఓ గ్రామానికి శుభకార్యానికి వచ్చి మలుపు వద్ద ఆటో బోల్తా పడింది. స్వల్పగాయాలతో బయటపడ్డారు. డొంకేశ్వర్ నుంచి నికాల్‌పూర్ వెళ్లే ప్రధాన రహదారి వెంట అనేక మలుపులు ఉండడంతో ప్రమాదాలు ఏర్పడి కొందరికి గాయాలపాలయ్యారు. నూత్‌పల్లి నుంచి నడ్కుడ వెళ్లే రహదారి వెంట అనేక మలుపులు ఉండడంతో తరచూ ద్విచక్ర వాహనదాలు ప్రమాదానికి గురై ప్రాణాలు కోల్పోయారు. మారంపల్లి నుంచి దత్తాపూర్ వెళ్లే రహదారి వెంట భయంకరమైన మలుపులతో ప్రమాదాలు సంభవించి కొందరు మంచానికి పరిమితమయ్యారు. నికాల్‌పూర్ నుంచి నందిపేట్ వెళ్లే మార్గంలో మలుపులు ఉండడంతో రాత్రి సమయంలో ఎదురుగా వస్తున్న వాహనాలు కానరాక ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ రహదారుల వెంట రేడియంతో సూచిక బోర్డులు ఏర్పాటు చేసి ప్రమాదాలను నివారించాలని ప్రజలు కోరుతున్నారు.

మలుపుల వద్ద భయం..

: సుమన్, నికాల్‌పూర్



రోడ్డుపై ఉన్నమలుపుల వద్ద భయం వేస్తుంది. బైక్‌పై వెళ్తుంటే ఎదురుగా వస్తున్న వాహనం కూడా కనిపించదు. అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలి.

బోర్డులు ఏర్పాటు చేయాలి..

:నాగరాజు, డొంకేశ్వర్



మలుపుల వద్ద రేడియంతో సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలి. రాత్రి వేళ వాహనదారులకు మలుపుల వద్ద ప్రమాదాలు చోటు చేసుకోకుండా అరికట్టాలి. సంబంధిత అధికారులు ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలి.



• డొంకేశ్వర్ నుంచి అన్నారం వెళ్లే దారి



• నడ్కుడ నుంచి అన్నారం వెళ్లే దారి



• నూత్‌పల్లి నుంచి నడ్కుడ వెళ్లే మలుపు

హోరాహోరీగా కుస్తీ పోటీలు



దూపల్లిలో తలపడుతున్న మల్లయోధులు



సాలూరాలో..

బోధన్ రూరల్/రెంజల్ మార్చి 24: బోధన్ పట్టణంలోని పోస్టు ఆఫీస్ సమీపంలోని ఏక చక్రేశ్వర కాలనీలో హోలీ పండుగ సందర్భంగా కుస్తీ పోటీలు హోరా హోరీగా సాగాయి. పట్టణ అభివృద్ధి సహకారంతో రెడ్డి కులసంఘం ఆధ్వర్యంలో ప్రతీ సంవత్సరం ఆనవాయితీగా కుస్తీ పోటీలు నిర్వహిస్తున్నారు. అలాగే సాలూర మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో ఆదివారం సాయంత్రం కుస్తీ పోటీలు కొనసాగాయి. పోటీలకు జిల్లా నుంచే కాకుండా మహారాష్ట్ర, కర్ణాటక తదితర ప్రాంతాల నుంచి కూడా మల్ల యోధులు పాల్గొన్నారు. గెలుపొందిన వారికి నగదు బహుమతితో పాటు వెండి కడియాన్ని అందజేశారు. అలాగే రెంజల్ మండల కేంద్రంతో పాటు దూపల్లి, సాటాపూర్ గ్రామాల్లో హోలీ పండుగను పురస్కరించుకుని కుస్తీ పోటీలు నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుండి వచ్చిన మల్లయోధులు కుస్తీపోటీలో పాల్గొన్నారు. కుస్తీ పోటీల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌ల సంఘం మండల మాజీ అధ్యక్షుడు రమేష్ కుమార్, దూపల్లి గ్రామ కమిటీ అధ్యక్షుడు లింగన్న యాదవ్, మాజీ సర్పంచ్‌లు సాయరెడ్డి, బాబన్న, మాజీ ఉప సర్పంచ్ కంచె సాయిలు, నితిన్, గోపికృష్ణ, భూమేష్, కుర్మె సాయిలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

నియమ, నిష్ఠల మధ్య కొనసాగుతున్న రంజాన్ ఉపవాస దీక్షలు

కమ్మర్‌పల్లి, మార్చి 24: ముస్లింల పవిత్రమాసం రంజాన్ మాసంలో చేపట్టే ఉపవాస దీక్షలు నియమ, నిష్ఠల మధ్య కొనసాగుతున్నాయి. ఈ నెల12 నుంచి ప్రారంభమయిన ఈ ఉపవాసదీక్షలు ఏప్రిల్ 10 రాత్రికి ముగుస్తాయి. షవ్వాల్ మాసం చంద్ర దర్శనంతో ఏప్రిల్ 11న ముస్లింలు రంజాన్(ఈద్-ఉల్-పితర్) పర్వదినాన్ని జరుపుకోవడానికి సన్నద్ధమవుతున్నారు. ఈ మాసంలోనే దివ్యఖుర్‌ఆన్(ముస్లింల పవిత్రగ్రంథం)దివినుంచి భువికి పంపడిందిగా విశ్వసిస్తూ.. అత్యంత పవిత్రరాత్రిగా కొలిచే షబ్-ఏ ఖద్ర్ (జాగరణ రాత్రి)ను అత్యంత భక్తిశ్రద్ధలతో దైవారాధనలో గడుపుతారు. రంజాన్ ప్రారంభంలో మొదలు పెట్టిన తరావి నమాజ్‌లో దివ్యఖురాన్ పఠనం షబ్-ఏ-ఖద్ర్ రాత్రి నమాజుతో ముగిసింది. రంజాన్ మాసంలో అన్నిరాత్రులకన్న ఈ రాత్రిని శుభాలరాత్రిగా పరిగణిస్తారు. రంజాన్ మాసం అరంభంనుండి చిన్నపెద్దల నమాజులతో మసీదులు, ముస్లింల ఇళ్లు దైవారాధనలతో కలకలలాడుతాయి. రంజాన్ మాసంలో ముస్లింలు పరస్పర ఇఫ్తార్ విందులలో పాల్గొంటున్నారు. కాగా ఎన్నికల కోడ్ అమలు ఉండడంతో రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించే ఇఫ్తార్ విందు ఈ సారి లేనట్టుగానే కనిపిస్తుంది. ఈ దఫా ఎండలు దంచి కొట్టడంతో కొంత మేర ఇబ్బందులు తప్పడం లేదు. అయినా దీక్షాపరులు దైవారాధనలో ఉత్సాహంగా ఈ ఉపవాసదీక్షల్లో పాల్గొనడం గమనార్హం.



రంజాన్ ఉపవాస దీక్షల్లో పాల్గొన్న ముస్లిం సోదరులు

మాయమాటలు చెప్పి లక్ష నొక్కేసారు

● కిరాణా షాపు ఓనర్‌కు సైబర్ వల

నిజామాబాద్‌అర్బన్, మార్చి 24: నగరంలోని పెద్దబజార్‌లో గల ఓకిరాణా షాపు ఓనర్‌ను సైబర్ నేరగాళ్లు మాయమాటలు చెప్పి లక్ష నొక్కేసిన ఘటన ఆదివారం వెలుగుచూసింది. ఐసీఐసీఐ బ్యాంక్ ఉద్యోగిని అని చెప్పి కరెంట్ అకౌంట్‌తో క్యూఆర్ కోడ్ అప్‌డేట్ చేయాలని ఆధార్, పాన్‌కార్డులను తీసుకొని యాప్‌ను డౌన్‌లోడ్ చేస్తానని నమ్మించి కిరాణాషాపు ఓనర్ గిరాకీలో బిజీగా ఉండటంతో ఆయన ఫోన్‌తో పాటు సైబర్ నేరగాడు పరారీ అయ్యాడు. కొద్ది సేపటి తర్వాత బ్యాంక్ ఖాతా నుంచి లక్ష రూపాయలు మాయమైనట్లు గుర్తించిన షాపు యజమాని రాజ్‌కుమార్ రెండవ టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

వెల్మ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

డొంకేశ్వర్, మార్చి24: అన్ని కులాలను కార్పొరేషన్ ఏర్పాటు చేసిన విధం గానే వెల్మ కార్పొరేషన్ కూడా ఏర్పాటు చేయాలని ఏర్పాటు చేసినట్లయితే వెనుకబడిన వెల్మ కులస్థులకు లబ్ధి చెందుతారని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు జలపతిరావు ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. 90శాతం వెల్మ కులస్థులు వ్యవసాయం మీద ఆధారపడి పని చేస్తున్నారని, ఆర్థికంగా బాగోలేక మామూలు చిన్న ఉద్యోగాలు చేసుకుంటూ జీవిస్తున్నారని అన్ని కులాల కార్పొరేషన్ ఏర్పాటు చేసినట్టుగానే వెల్మ కార్పొరేషన్ కూడా ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వంలోనైనా కార్పొరేషన్ ఏర్పాటు చేసి ఆర్థికంగా వెనుకబడిన వెల్మలకు న్యాయం జరిగేల చూడాలని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఆయన విజ్ఞప్తి చేశారు.

విద్యార్థులు భవిష్యత్ కార్యాచరణను

విద్యార్థులు సిద్ధం చేసుకోవాలి



మాట్లాడుతున్న అధ్యాపకుడు ఉప్పాల శ్రీనివాస్

ఆర్మూర్‌రూరల్, మార్చి24: పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులు భవిష్యత్ కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేసుకోవాలని వృక్షశాస్త్ర అధ్యాపకుడు, డిగ్రీ కళాశాల అధ్యాపక పోస్టుల్లో రాష్ట్రస్థాయిలో మొదటి ర్యాంకు సాధించిన ఉప్పాల శ్రీనివాస్ అన్నారు. ఆదివారం ఆర్మూర్ మండలం అంకాపూర్ గ్రామంలో భార్గవి విద్యానికేతన్‌లో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు పట్టుదల, లక్ష్యంతో చదివి ఉన్నత స్థానాలను చేరుకోవడానికి కృషి చేయాలన్నారు. విద్యా భివృద్ధికి కృషి చేస్తున్న గురువు ప్రాముఖ్యత వేల కట్టలేనిదన్నారు. విద్యార్థి నిలోని నైపుణ్యాలను వెలికితీసి ఉత్తముడిగా తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర మరువలేనిదన్నారు. ప్రతీ విద్యార్థి ఉపాధ్యాయులు బోధించిన అం శాలను జీవితంలో అలవర్చుకుంటే ఉన్నత స్థానంలో నిలుస్తారన్నారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ అధ్యక్షుడు పట్వారి గోపికృష్ణ, కార్యదర్శి తులసీ పట్వారి, పాఠశాల ప్రిన్సిపాల్ పట్వారి ప్రగతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రకృతి సిద్ధమైన వస్తువులనే వినియోగించాలి



మట్టి స్నానం చేస్తున్న యోగా సాధకులు

రుద్రూరు, మార్చి 24 : ప్రకృతి సిద్ధమైన వస్తువులు వినియోగిస్తే రోగాలు దూరమవు తాయని యోగా యూనివర్సిటీ తెలంగాణ రాష్ట్ర మీడియా ఇన్‌చార్జి డాక్టర్ విశ్వనాథ్ మహాజన్ పేర్కొన్నారు. రుద్రూరు చెరువు సమీపంలోని ప్రకృతి వనంలో ఆదివారం పతాంజలి యోగా సమితి ఆధ్వర్యంలో మట్టి స్నానం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ విశ్వనాథ్ మాట్లాడుతూ వేసవిలో వేడి నుంచి ఉపశమనం, చర్మ రోగాల నివారణ, బీపీ, షుగర్, కొలెస్ట్రాల్, గుండెపోటు, వివిధ రోగాల వైరస్‌ల నివారణ కొరకు ఔషధమూలికలతో మట్టిస్నానం ద్వారా రోగ నిరోధక శక్తిని పెంచుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పతాంజలి యోగ సభ్యులు శ్రీనివాస్, ఆనంద్, సతీష్‌గౌడ్, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

మన సాంప్రదాయాలు ప్రపంచానికే ఆదర్శం



క్షత్రియ పాఠశాలలో నృత్యాలు చేస్తున్న విద్యార్థినులు

ఆర్మూర్‌రూరల్, మార్చి24: మన సంస్కృతి, సాంప్రదాయలు ప్రపంచానికి ఆదర్శంగా నిలుస్తున్నాయని ఆర్‌ఎస్ఎస్ రాష్ట్ర బౌదిక్ సహ ప్రముఖ్ ఇందూర్ విభాగ్ ప్రచారక్ ఎన్‌వీ.శివకుమార్ అన్నారు. ఆర్మూర్ మండలం చేపూర్‌లోని క్షత్రీయ పాఠశాలలో ఆదివారం నిర్వహించిన వార్షికోత్సవ వేడుకల కళా మహోత్సవ్ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రాచీన భారతంలో ప్రతీ గ్రామంలో ఒక గురుకులం ఉండేదని, లార్డ్ మెకాలే ప్రవేశపెట్టిన నూతన విద్యావిధానం వల్ల మన గురుకుల వ్యవస్థను నాశనం చేశారని ఆయన విమర్శించారు. భారతదేశం ప్రపంచానికి జ్ఞానం అందించి విశ్వగురువు స్థానం పొందిందని పేర్కొన్నారు. చదువు మనిషిలో మానవత్వం నింపిందని, దైవత్వం వైపు తీసుకువెళ్లాలని తల్లిఒడి, చదువుబడి, దేవాలయం ఈ మూడు కేంద్రాలు మనిషిని ఉన్నతవంతునిగా తీర్చిదిద్దుతాయన్నారు. ఈ సందర్భంగా విద్యార్థిని విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు అందరిని అలరించాయి.ఈకార్యక్రమంలో క్షత్రీయ విద్యాసంస్థల చైర్మన్ అల్జాపూర్ శ్రీనివాస్, కరస్పాండెంట్ అల్జాపూర్ దేవేందర్, అల్జాపూర్ గంగాధర్, వైస్‌చైర్మన్ లక్ష్మీనారాయణ, డైరెక్టర్‌లు వీరేంద్ర, అక్షయ్, పరిక్షిత్,ప్రిన్సిపాల్ లక్ష్మీనారాయణస్వామి, అరుంధతి, తదితరులు పాల్గొన్నారు.

బ్రాహ్మణ్‌పల్లిలో ఎన్‌ఎస్ఎస్ శిబిరం

జక్రాన్‌పల్లి, మార్చి24: మండలంలోని బ్రాహ్మణ్‌పల్లి గ్రామంలో ఆర్మూర్ సాంఘిక సంక్షేమ మహిళా గురుకుల డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో ఎన్‌ఎస్ఎస్ శిబిరం కొనసాగుతుంది. ఆదివారం గ్రామంలో బాలికల విద్య, బాల్య వివాహల నిర్మూలనపై ఎన్‌ఎస్ఎస్ విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎన్‌ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారిణి పి.చైతన్యశాంతి, ప్రోగ్రాం సభ్యురాలు ఉమదీపిక, ఎస్ఎస్ఎస్ వాలంటీర్లు, గ్రామస్థులు పాల్గొన్నారు.



బ్రాహ్మణ్‌పల్లిలో ర్యాలీ నిర్వహిస్తున్న ఎన్ఎస్ఎఫ్ విద్యార్థులు

మరణ మృదంగానికి ఆరేళ్లు

● రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఆటో ప్రమాదం ● మృతుల కుటుంబాల్లో నేటికి తీరని విషాదం ● నేటికి రోడ్డు పక్కన బావులపై కంటి తుడుపు చర్య



మెండోరా, బుస్సాపూర్ గ్రామాల మధ్య రోడ్డు పక్కన ఉన్న అతి ప్రమాదకర బావి ఇదే..



కోడిచర్ల, మెండోరా గ్రామాల మధ్య రోడ్డు పక్కనే ఉన్న వ్యవసాయ బావి ఇదే..

మెండోరా, మార్చి24: అత్తగారంటి నుంచి తల్లి గారింటికి వస్తున్న పిల్లలతో ఓ మహిళ, తన కూతురుని అత్తగారింటి నుంచి తల్లిగారింటికి తీసు కోస్తున్న ఓ తల్లి, బంధువులను మాట్లాడియ్యడానికి వస్తున్న మరికొందరు, పుట్టిన రోజు వేడుకల్లో పాల్గొనేందుకు మరికొందరు తమ గ్రామాలకు వస్తుండగా మృత్యురూపంలో వచ్చిన ఆటోని ఎక్కి తమ విలువైన ప్రాణాలను బలిగొన్న రోడ్డు పక్కన బావి విషాద ఘటన 11మంది దుర్మారణం పాలయ్యారు. నేటికి ఈ ఘటనను మండల ప్రజలు జీర్ణించుకోలేకపోతున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి.

> "కాసేపట్లో ఇంటికి చేరుతామన్న ఆనందలో చిన్నారులు,తల్లి, అత్త గారింటిలో అలసట చెందిన కూతురిని ప్రేమతో తీసుకోస్తున్న తల్లి, పుట్టిరోజు వేడుకల్లో అనంద డోలికల్లో ఊగలన్న చిన్నారుల ఆత్రూత, బంధువులను మాట్లాడడానికి వెళ్లాల్సిన పెద్దలు, తమ తమ ఆలోచనలతో నిండైన హృదయంతో ఊరికి వస్తుంటే ఆటో రూపంలో మృత్యుఒడిలో చేరిన విషాదం.. మరువలేక పోతున్న జనం"

● నేటికి ఆటో ప్రమాద కుటుంబాల్లో విషాదచాయలు

2018మార్చి 25వ తేదీ మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో ముప్కాల్ మండల కేంద్రం నుంచి 22మంది ప్రయాణికులతో (చిన్న పిల్లలతో సహ) ఆటో మెండోరా వైపు వస్తోంది. రెండు నిమిషాలు అయితే ఆటో మెండోరా మండల కేంద్రానికి చేరుకుంటుంది. కానీ మృత్యు అనే రూపం డ్రైవర్ నిర్లక్ష్యం వల్ల ఆటో వ్యవసాయ బావిలోకి దూసుకెళ్లింది. దీంతో ఆటోలో ఉన్న 11మంది ప్రాణాలతో బయటపడ్డారు. 11మంది ప్రాణాలు గాల్లో కలిసిపోయాయి. ఆరేండ్లు అవుతున్న కానీ ఇప్పటి వరకు ఇదే మెండోరా మండలంలో రోడ్డు పక్కన ప్రమాదకర బావులు చాలా ఉన్నాయి. పురాతన వ్యవసాయ బావులు రోడ్డు పక్కన ఉండడంతో ప్రయాణికుల పాలిట శాపంలా మారింది. రాష్ట్రంలో తరచుగా ఎక్కడో ఒక చోట బావిలో వాహనాలు పడుతున్న ఘటనలు నిత్యం చోటు చేసుకునే ఉంటున్నాయి. ప్రమాదం జరిగిన వారం రోజుల క్రితం హడావిడి చేస్తున్న అధికారిక యంత్రాంగం తర్వాత అటు వైపు చూడకపోవడంతో మృత్యు కుహరాలుగా మిగిలిపోతున్నాయి. రోడ్డు పక్కన బావులను లెక్కలు తీసి మరి తెలుసుకున్న అధికారిక యంత్రాంగం వాటి రక్షణ చర్యలు చేపట్టకపోవడం పూర్తిగా విఫలమయ్యారని ప్రజలు వాపోతున్నారు.

● 11మంది ప్రాణాలు గాల్లో కలిసిపోయిన కానీ..

మెండోరా శివారులో 2018మార్చి 25వ తేదీన రోడ్డు పక్కనే ఉన్న వ్యవసాయ బావిలో డ్రైవర్ నిర్లక్ష్యంతో 11మంది ప్రాణాలు గాల్లో కలిసిపోయాయి. 11మంది ప్రాణాలు పోయిన తర్వాత అధికార యంత్రాంగం వారం రోజుల పాటు మెండోరా, ముప్కాల్ దారి గుండా రోడ్డు పక్కన ఉన్న ప్రమాదకరబావులను గుర్తించి హెచ్చరిక బోర్డులతో పాటు ఇనుప డ్రిల్లింగ్ లను ఏర్పాటు చేసింది. ముప్కాల్ శివారులో లక్ష్మీకాలువ వంతెన వద్దకు రాగానే ప్రయాణికులు జంకుతునే ఉన్నారు. అక్కడ రెండు వైపుల ఇనుప కంచెలు లేక వాహనదారులు ప్రాణాలు ఆర చేతిలో పెట్టుకొని ప్రయాణి స్తున్నారు.

● మెండోరా, బుస్సాపూర్ గ్రామాల మధ్య రోడ్డు పక్కన ప్రమాదకర బావులు

మెండోరా శివారులో వ్యవసాయ బావిలో ఆటో బోల్తా పడిన సంఘటనను దృష్టిలో పెట్టుకొని అధికార యంత్రాంగం రెండు గ్రామాల మధ్య ఉన్న ప్రమాదకర బావులను గుర్తించారు. కానీ ఇప్పటి వరకు రక్షణ చర్యలు చేపట్టడంలో విఫలమయ్యారని వాహనదారులు అంటున్నారు. ప్రమాదం జరిగిన దారి గుండా ప్రయాణం చేయాలంటే వాహనదారులు జరిగిన సంఘటనను గుర్తు చేసుకొని జంకుతున్నారు. అటు నుంచి ప్రయాణం చేయకుండా మెండోరా, బుస్సాపూర్ దారిగుండా ప్రయాణం చేస్తున్నారు. కానీ మళ్ళీ రోడ్డు పక్కనే ఉన్న బావులను చూసి జంకుతున్నారు. ఎప్పుడు ఏ మృత్యురూపంలో ఎటువంటి ప్రమాదం జరుగుతుందో అని ప్రజలు భయపడుతున్నారు. బుస్సాపూర్ వద్ద రోడ్డుకు మిటర్ దూరంలో అతి ప్రమాదకరమైన బావి ఉన్న కానీ ఇప్పటి వరకు చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. కోడిచర్ల, మెండోరా గ్రామాల మధ్య అతి ప్రమాదకర బావి ఉన్నాయి. ఈ దారి గుండా నిత్యం ప్రైవేటు పాఠశాలల, ఆర్టీసీ బస్సులలో ప్రజలు ప్రయాణాలు సాగిస్తూ ఉన్నారు. ప్రమాదకర బావుల మధ్యన ప్రయాణం చేయాలంటే భయపడుతున్నారు. విద్యార్థులు, ప్రజలు ఇప్పటికైనా అధికారులు స్పందించి అధికార యంత్రాంగం చర్యలు తీసుకొని ఇనుప కంచెలు ఏర్పాటు చేసి అతిప్రమాదకర బావులపై చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

టీయూ అభివృద్ధికి కృషిచేస్తా : ఇన్‌చార్జి వీసీ

● విద్యార్థుల వివరాలు తెలుసుకున్న ఇన్‌చార్జి వీసీ

డిచ్‌పల్లి, మార్చి 24:నిజామాబాద్ జిల్లా తెలంగాణ విశ్వవిద్యాలయంను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తానని ఇందుకోసం విద్యార్థులు, అధికారులు చేయూతనందించాలని యూనివర్సిటీ సమస్యల పరిష్కారానికి తాను ప్రత్యేక శ్రద్ధతో కృషి చేసేందుకు చొరవ చూపుతానని తెలంగాణ యూనివర్సిటీ ఇంచార్జి వైస్ చాన్సిలర్ బుర్ర వెంకటేశం అన్నారు. ఆదివారం తెలంగాణ విశ్వవిద్యాలయాన్ని ఆయన సందర్శించగా రిజిస్ట్రార్ యాదగిరి పుష్పగుచ్చం అందజేసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా విద్యార్థులు, అధ్యాపకులతో మాట్లాడుతూ బాలికల హాస్టల్ నూతన భవనం నిర్మాణం కోసం ప్రభుత్వం ఇప్పటికే 7 కోట్ల రూపాయలు మంజూరు చేసిందని పార్లమెంట్ ఎన్నికల కోడ్ నేపథ్యంలో ఇట్టి పనులను ఎన్నికల అనంతరం ప్రారంభిస్తామన్నారు. విశ్వవిద్యాలయంలో బాలికల హాస్టల్ కొరతపై విద్యార్థులు, అధికారులు తనకు వివరించారని మొదటి ప్రాధాన్యతగా తప్పక చర్యలు తీసుకుంటామన్నారు. అంతేకాకుండా విశ్వవిద్యాలయంలో విద్యార్థులు అనారోగ్య సమస్యలు తలెత్తకుండా అంబులెన్స్‌ను ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. విద్యార్థులకు ప్లేస్‌మెంట్‌లు జరిగే విధంగా తప్పక కృషి చేస్తానని విశ్వవిద్యాలయంలో చదువుతున్న విద్యార్థులు ఉన్నత పౌరులుగా ఎదగాలని ఆయన సూచించారు. సైన్స్ భవనం నిర్మాణంపై 10వేల మంది పట్టే విధంగా ఆడిటోరియాన్ని నిర్మించాలని ఇందుకు కావాల్సిన ప్రతిపాదనలు తనకు పంపాలని రిజిస్ట్రార్ యాదగిరితో పాటు ఇంజనీరింగ్ అధికారులను ఆయన ఆదేశించారు. 2014 బ్యాచ్ ప్రొఫెసర్లు ఇంచార్జి వీసీని కలువగా పదోన్నతుల విషయం ప్రభుత్వ పరిశీలనలో ఉందని తాను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. తెలంగాణ విశ్వవిద్యాలయంలో వార్షికోత్సవ సంబరాలను ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని ఎన్ఎస్‌యుఐ అధ్యక్షుడు శ్రీశైలం ఇంచార్జి వీసీకి వినతిపత్రం అందించగా ఆయన సానుకూలంగా స్పందించారు. అంతేకాకుండా విద్యార్థులకు సెంట్రల్ లైబ్రేరీకి కావాల్సిన ఉద్యోగ అవకాశాల పుస్తకాలను కూడా అందుబాటులో ఉంచేందుకు చర్యలు తీసుకోవాలని ఇందుకు సంబంధించిన వివరాలను కూడా తనకు తెలపాలని అధికారులను ఆదేశించారు.



సైన్స్ భవన నిర్మాణం పనులను పరిశీలిస్తున్న ఇన్‌చార్జి వీసీ

● ఆందోళనతో సమస్యలు పరిష్కారం కాదు

తెలంగాణ విశ్వవిద్యాలయంలో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు ఆందోళన ద్వారా ఎలాంటి సమస్యలు పరిష్కారం కావని ఇప్పటి వరకు 47 పోస్టులు సాంక్షన్ కాగా 275 పోస్టులు రెగ్యూలర్ కావాల్సి ఉందని ఓయూలో కూడా 35 సంవత్సరాలుగా ఎంతో మంది ఉద్యోగులు కాంట్రాక్టు పద్ధతిపై పనిచేస్తున్నారని ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు ఆందోళన విరమించి అధికారులకు సహకరించే విధంగా పనిచేయాలన్నారు. ఇట్టి విషయంలో రాష్ట్రంలోని అన్ని యూనివర్సిటీల ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులపై ముఖ్యమంత్రితో చర్చించి తగు నిర్ణయం తీసుకుంటామని జూన్ వరకు తెలంగాణ యూనివర్సిటీకి కొత్త వీసీ రానున్నారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు ఇంచార్జి వీసీని సన్మానం చేస్తామని శాలువ తీసుకురాగా సమస్య పరిష్కారం అయిన తర్వాతే సన్మానాలు చేసుకుంటానని చెప్పగా ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే వారితో సన్మానం చేసుకొని సమస్యల పట్ల సానుకూలంగా స్పందించారు.

సారంగాపూర్ బీఈడీ కళాశాలకు ప్రహరీ నిర్మించాలి

తెలంగాణ యూనివర్సిటీ పరిధిలోని సారంగపూర్ బీఈడీ కళాశాల చుట్టూ యూనివర్సిటీ భూములు ఆక్రమణకు గురికాకుండా ప్రహరిగోడ నిర్మించేందుకు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు, పోలీస్ కమీషనర్ కల్మేశ్వర్‌లకు ఇంచార్జి వీసీ బుర్ర వెంకటేశం వివరించారు. ఆడిటోరియం నిర్మించేందుకు కావాల్సిన ప్రతిపాదనలు పంపాలని సూచించారు. ఆయన వెంట రిజిస్ట్రార్ యాదగిరి, ప్రొఫెసర్లు చంద్రశేఖర్, నాగరాజు, మహేందర్, విద్యార్థి సంఘ నాయకులు, తదితరులు ఉన్నారు.

- జిల్లా కలెక్టర్‌ను కోరిన ఇన్‌చార్జి వీసీ

కోనాసముందర్ సొసైటీ నిధులపై విచారణ జరిపిస్తాం

● బాధ్యులను శిక్షించి రైతులకు న్యాయంజరిగేల చూస్తాం ● టీపీసీసీ అధికార ప్రతినిధి వేణుగోపాల్ యాదవ్

కమ్మర్‌పల్లి, మార్చి 24: మండంలోని కోనాసముందర్ సొసైటీలో సుమారు కోటి రూపాయల అవినీతిపై విచారణ జరిపించి బాధ్యులైన వారిపై తగు చర్యలు తీసుకుంటు సొసైటీ పరిధి గ్రామాల రైతులకు తగు న్యాయం జరిగేలా చూస్తామని టీపీసీసీ అధికార ప్రతినిధి వేణుగోపాల్ యాదవ్ అన్నారు. ఆదివారం కమ్మర్‌పల్లి మండల పార్టీ కార్యాలయంలో మండల కాంగ్రెస్ నాయకులతో కలిసి విలేఖరుల సమావేశంలో మాట్లాడుతూ చేస్తూ ఈ విషయమై జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణరావును కలిసి ఫిర్యాదుచేస్తూ విచారణ కోరనున్నట్లు తెలిపారు. గత నాలుగేళ్ల పాలన కాలంలో సొసైటీలో సీఈవో రాజేశ్వర్ సుమారు కోటి రూపాయల అవినీతికి పాల్పడినట్లు సొసైటీ పరిధి గ్రామాల రైతులు ఆరోపిస్తూ లెక్కలు చెప్పాలని నిలదీస్తే తమకేమి తెలవదని చైర్మన్ సామ బాపురెడ్డి, పాకలవర్గ సభ్యులు చేతులు దులుపుకోవడం విడ్డూరమన్నారు.రైతులకు అందించే ఎరు వులు కమిషన్ రూ.60లక్షలు, కొనుగోలు కేంద్రాల కమిషన్ రూ. 20లక్షల వరకు నిధుల లెక్కలు చెప్పలేక పొంతనలేని సమాధానాలు చెప్పడం ఏంటని ప్రశ్నించారు. చివరికి రైతులు సొసైటీ చైర్మన్, వైస్, చైర్మన్, పాలకవర్గ సభ్యుల సమక్షంలో సొసైటీకి తాళంవేసిన దుస్థికి చేరడం అహ్యస్పదమన్నారు. బాల్కొండ నియోజికవర్గంలో ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి సహకార సంఘాలను అవినీతిమయంగా మార్చేశారని, అవి నీతి పరులను పెట్టి పోషిస్తున్నారని ఆరోపించారు. అవినీతి పరులను కాంగ్రెస్ ప్రభుత్వం వదిలే ప్రసక్తి లేదని రైతుల డబ్బ్యూ స్వాహాచేసినవారిపై విచారణ జరిపించి కఠినంగా శిక్షించేలా, వారినుంచి రైతులసొత్తు రికవరీ జరింపించేలా చూస్తామని అన్నా రు. సమావేశంలో మండల కాంగ్రెస్ అధ్య క్షుడు సుంకెటరవి, పడిగెల ప్రవీన్ పాలెపు నర్సయ్య, జిల్లా నాయకులు తక్కూరి దేవేందర్, బుచ్చిమల్లయ్య, గంగారెడ్డి, ప్రసాద్, కోనాసముందర్ గ్రామ కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న టీపీసీసీ అధికార ప్రతినిధి వేణుగోపాల్ యాదవ్



బుర్ర వెంకటేశంకు టీయూలో పుష్పగుచ్చం అందజేస్తున్న రిజిస్ట్రార్ యాదగిరి

'యూనివర్సిటీ సమస్యలను వెంటనే పరిష్కరించాలి '

డిచ్‌పల్లి, మార్చి24: తెలంగాణ విశ్వవిద్యాలయం శాఖ ఆధ్వర్యంలో యూనివర్సిటీ సమస్యలు పరిష్కరించాలని ఇంచార్జి వీసీ బుర్ర వెంకటేశంకు వినతిపత్రం అందజేశారు. ఏబీవీపీ టీయూ నాయకులు మాట్లాడుతూ నూతన గర్ల్స్ హాస్టల్ నిర్మించాలని విద్యార్థినిలకు సరిపోవడం లేదని యూనివర్సిటీ ఆడిటోరియం నిర్మించాలని, స్పోర్ట్స్ గ్రౌండ్‌ను, క్రీడావస్తువులను అందుబాటులోకి తేవాలని అన్నారు. నూతన కోర్సులు ఇంజనీరింగ్ విద్యను అందించి విద్యార్థులకు న్యాయం చేయాలని పరీక్షా ఫలితాలను త్వరగా అందించాలని, కొత్త డాక్టర్‌ను నియమించాలని నూతన అంబులెన్స్ ఏర్పాటు చేయాలని విన్నవించారు. యూనివర్సిటీలో వీసీ రవీంద్రగుప్త చేసిన అవినీతిలో భాగస్వాములైన అవినీతి అధికారులపై వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ నాయకులు సాయికుమార్, అమృత్, పావని, కృష్ణ ప్రమోద్, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర సబ్‌జూనియర్ సాఫ్ట్‌బాల్ పోటీలో ఛాంపియన్‌గా జిల్లా జట్టు

సుభాష్‌నగర్, మార్చి 24:రాష్ట్ర స్థాయి సబ్‌జూనియర్ సాఫ్ట్‌బాల్ పోటీలో జిల్లా బాలుర జట్టు ఛాంపియన్‌గా నిలిచినట్లు జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ప్రభాకర్‌రెడ్డి, మోహన్‌లు తెలిపారు. ఈనెల 23, 24 తేదీలలో యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరులో జరిగిన పోటీలో మెదక్ జట్టుపై ఫైనల్ పోటీలో 4-0 పరుగుల తేడాతో గెలుపొంది ఛాంపియన్‌గా నిలిచింది. ఈ టోర్నమెంట్‌లో బెస్ట్ పిక్చర్‌గా బానోత్ చందు ప్రత్యేక బహుమతి అందుకున్నారు. జిల్లా జట్లకు కోచ్ మేనేజర్లుగా మార్కంటి గంగామోహన్, నరేష్‌లు వ్యవహరించారు. జిల్లా జట్టు ఛాంపియన్‌గా నిలవడం పట్ల పలు క్రీడాసంఘాలు హర్షం వ్యక్తం చేశాయి.

తాళం వేసిన ఇంట్లో చోరీ

రుద్రూరు, మార్చి 24: తాళం వేసిన ఓ ఇంట్లో చోరీ జరి గిన సంఘటన రుద్రూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్ఐ అప్పారావు తెలిపిన వివరాల ప్రకారం రుద్రూరు మండల కేంద్రంలోని ఎల్లమ్మ మందిరం సమీపంలో గల కటికే జలోజి ఇంట్లో ఇంటి తాళం పగులగొట్టి గుర్తు తెలి యని వ్యక్తులు చోరీకి పాల్పడ్డట్లు తెలిపారు. ఈ చోరీ ఘ టనలో దాదాపుగా రూ.50 వేల విలువ గల వెండి, ఇత్తడి తదితర సామగ్రి చోరీ జరిగి నట్లు పేర్కొన్నారు. ఆదివారం ఇంటి యజమాని జలోజి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

ఎస్సై హరిబాబును వెంటనే సస్పెండ్ చేయాలి

భీమ్‌గల్ రూరల్, మార్చి24: భీమ్‌గల్ పట్టణ మున్సిపల్ కో ఆప్షన్ మెంబర్ పర్సనవీన్‌పై ఈ నెల 18 వ తేదీన భీమ్‌గల్ పోలీస్ స్టేషన్‌లో గల్లా పట్టుకొని రూంలోకి తీసుకెళ్లి చేయిచేసుకున్నాడని తన ఇష్టం వచ్చినట్లు దురుసుగా భీమ్‌గల్ ఎస్సై హరిబాబు ప్రవర్తించడాని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు దొన్కంటి నర్సయ్య అన్నారు. ఆదివారం బీఆర్ఎస్ పార్టీ పట్టణ కార్యాలయంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సంధర్భంగా బీఆర్ఎస్ నాయకులు కన్నె సురేందర్ మాట్లాడుతూ పర్స నవీన్‌పై ఎస్సై ప్రవర్తించిన తీరు ఫ్రెండ్లీ పోలీస్ విధానాన్ని కళ్లకు కట్టేలా వుందన్నారు. సామాన్యుడు పోలీస్ స్టేషన్‌కు వెళితే వారికి న్యాయం జరగదని అన్నారు. ఎస్పీకి ఫిర్యాదు చేసిన ఇప్పటి వరకు ఎటువంటి చర్య ఎస్సైపై తీసుకోలేదని అన్నారు. పర్స నవీన్ కు న్యాయం జరిగే వరకు పోరాడుతామని బీఆర్ఎస్ నాయకులు శర్మనాయక్ అన్నారు. ఈకార్యక్రమంలో మండల బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ మండల అధ్యక్షులు

గ్రామాల్లో హోలీ సంబరాలు

మోర్తాడ్, మార్చి24: మోర్తాడ్ మండలంలోని ఆయా గ్రామాలలో హోలీ సంబరాలు యువకులు, ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. ఆదివారం మండలంలోని మోర్తాడ్, శెట్‌పల్లి, తిమ్మాపూర్, పాలెం, దొన్‌పాల్, ఇతర గ్రామాలలో యువకులు పెద్దలు ఒకరినోకరు రంగులు చల్లుకుంటూ హోలీ సంబరాలు జరుపుకున్నారు. యువజన సంఘాలు, యువకులు వీదుల్లో తిరుగుతూ తోటి స్నేహితులకు రంగులు చల్లుతూ, డీజేలు పెట్టుకొని నృత్యాలు చేస్తూ హోలీ సంబరాలు జరుపుకున్నారు.

మద్యం దుకాణాల మూసివేత

నవీపేట,మార్చి24: మండలంలో ఆదివారం సాయంత్రం నుంచి మద్యం దుకాణాలను మూసి వేయడం జరిగిందని ఎస్ఐ యాదగిరి గౌడ్ తెలిపారు. నిజామాబాద్ సీపి కల్మేశ్వర్ ఆదేశాల మేరకు మండలంలో ఉన్న మద్యం దుకాణాలు, కల్లు దుకాణాలను ఆదివారం సాయంత్రం నుండి మంగళవారం ఉదయం 6గంటల వరకు దుకాణాలను మూసి ఉంచడం జరుగుతుందని ఆయన పేర్కొన్నారు. హోలీ పండుగను పురస్కరించుకుని ఎటువంటి గొడవలు కాకుండా ముందు జాగ్రత్తగా ఈ దుకాణాలను మూసి ఉంచడం జరుగుతుందని ఆయన పేర్కొన్నారు.

జిల్లా అంతటా ఘనంగా హోలీ వేడుకలు



ఆలూర్‌లో రంగోళిలో పాల్గొన్న యువకులు



నందిపేటలో హోలీ సంబరాల్లో మునిగిన యువత



సాలూరలో ..



ధర్పల్లిలో..

బోధన్‌రూరల్: బోధన్, సాలూర మండలాల్లోని పలు గ్రామాల్లో ఆదివారం హోలీ పండుగను ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. సార్గామ్మ ఉన్న ఊర్లలో ఒక రోజు ముందుగా హోలీగా పండుగ అనవాయితీ ప్రకారం జరుపుకుంటారు. ఒకరిపై ఒకరు రంగులు జల్లుకుంటూ హోలీ శుభాకాంక్షలు తెలుపుకుంటారు. సాలూర మండల కేంద్రంతో పాటు అమ్దాపూర్ తదితర గ్రామాల్లో హోలీ పండుగను ఘనంగా జరుపుకున్నారు.ఈ హోలీ పండుగలో గ్రామపెద్దలు,గ్రామస్థులు, యువకులు, చిన్నారులు, మహిళలు పాల్గొన్నారు.

వర్ని: వర్ని, చందూర్ మండల కేంద్రాల పరిధిలో ఆదివారం హోలీ పండుగ సంబరాలు వైభవంగా నిర్వహించారు. శనివారం రాత్రి ఆయా మండల కేంద్రాలు, గ్రామాల్లో కామ దహనం అనంతరం మహిళలు కామ దేవుడికి పూజలు చేసి పాటలు పాడారు. ఆదివారం డప్పు వాయిద్యాలతో ప్రజలు, యువతీ, యువకులు రంగు రంగుల నీళ్లను చల్లుకుని కేరింతలు కొట్టారు. పలు గ్రామాల్లో కుస్తీపోటీలు నిర్వహించారు. అనంతరం గ్రామ చెరువుల్లో హోలీకి వీడ్కోలు చెబుతూ స్నానాలు చేశారు. తగిలేపల్లి గ్రామంలో రొడ్డ పోశెట్టి అనే వ్యక్తి 70కిలోల బండరాయిని 200మీటర్ల దూరం వరకు భుజంపై మోసి గ్రామ ప్రజలను ఆసక్తి పరిచారు.

రుద్రూరు:మండల కేంద్రంలోని అంబం, చిక్కడపల్లి, బొప్పాపూర్ గ్రామాల్లో హోలీ పండుగ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. చిన్న, పెద్ద తేడా లేకుండా ఒకరిపై ఒకరు రంగులు వేసుకుంటూ వేడుకలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఒకరినోకరు హోలీ పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. యువకుల కేరింతలతో గ్రామాలు సందడిగా మారాయి. ఈ కార్యక్రమాల్లో గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

ధర్పల్లి: మండలంలో హోలీ వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. చిన్నా పెద్ద తేడా లేకుండా అందరూ రంగులు చల్లుకొని శుభాకాంక్షలు తెలుపుకున్నారు. కుల మతాలకు అతీతంగా అందరూ హోలీ వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీపీ సారిక హన్మంత్‌రెడ్డి, వీడీసీ చైర్మన్ అర్గుల్ రాజేశ్వర్‌రెడ్డి ప్రజలకు హోలీ శుభాకాంక్షలు తెలిపారు.

ఇందల్వాయి:మండల వ్యాప్తంగా ఆదివారం హోలీ సంబరాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. శనివారం రాత్రి కామదహనం చేసి ఉద యం నుంచి హోలీ పండుగ నిర్వహించారు. చిన్నపిల్లలు, యువతీ యువకులు రంగులు చల్లుకుంటూ పండుగను జరుపుకున్నారు. చిన్నారుల కేరింతలతో వీధులన్నీ సందడిగా మారాయి. ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుం టూ పండుగను జరుపుకున్నారు.ఇందల్వాయి గ్రామంలో యువకులు రంగు లు ఆడుకుంటూ బండరాయిని ఎత్తి తమ బల బలాలను ప్రదర్శించుకున్నారు.

మోస్రా: మండల కేంద్రంతో పాటు మండలంలోని ఆయా గ్రామాల్లో హోలీ సంబరాలను ఘనంగా నిర్వహించారు. రంగులు చల్లుకుంటూ ఒకరికొకరు పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈ సందర్భంగా మోస్రా మండల కేంద్రంలో వార సంత ప్రాంతంలో గ్రామ కమిటీ ఆధ్వర్యంలో కుస్తీపోటీలు నిర్వహించి పోటీలలో గెలుపొందిన వారికి నగదు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు, యువకులు, చిన్నారులు తదితరులు పాల్గొన్నారు.

కోటగిరి: కోటగిరి ఉమ్మడి మండలంలో ఆదివారం హోలీ సంబరాలను ఘనంగా జరుపుకున్నారు. శనివారం రాత్రి కోటగిరి, పొతంగల్ మండల కేంద్రాలతో పాటు ఆయా గ్రామాలలో కామ దహనం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

సిరికొండ:మండలంలోని రావుట్ల, న్యావనంది, రామడుగు, తూంపల్లి తదితర గ్రామాల్లో హోలీ పండుగను ప్రజలు ఘనంగా నిర్వహించుకున్నారు. శనివారం రాత్రి కామదహనం చేసి ఆదివారం ఉదయం నుండి సాయంత్రం వరకు పిల్లలు, పెద్దలు రంగులు చల్లుకొని ఆనందోత్సవాల మధ్య పండుగను ఘనంగా నిర్వహించుకున్నారు.

రెంజల్: మండలంలోని రెంజల్, సాటాపూర్, దూపల్లి, బోర్గాం, నీలా, కళ్యాపూర్, దండిగుట్ట గ్రామాలలో ఆదివారం ఘనంగా హోలీ పండుగను నిర్వహించారు. శనివారం రాత్రి కామ దహనం చేసి ఆదివారం హోలీ వేడుకలను నిర్వహించుకున్నారు.

నవీపేట: మండలంలోని పలు గ్రామాలలో ఆదివారం హోలీ సంబరాలను ఘనంగా జరుపుకున్నారు. మండలంలోని నాళేశ్వర్, నాడాపూర్, జన్నేపల్లి, అబ్బాపూర్(ఎం) తదితర గ్రామాలలో హోలీ పండుగ నిర్వహించారు. ఈ సందర్భంగా యువకులు ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుంటూ పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. చిన్నారులు ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుంటూ కేరింతల మధ్యన హోలీ సంబరాలు జరుపుకున్నారు.

కమ్మర్‌పల్లి: రంగుల కేళీ హోలీ పర్వదిన సంబరాలను కమ్మర్‌పల్లి మండలంలోని గ్రామాల్లో ప్రజలు ఆదివారం ఆనందోత్సవాలమధ్య ఘనంగా జరుపుకున్నారు. చిన్నా పెద్ద, కులమతాల కతీతంగా ప్రతిఒక్కరు హోలీ సంబరాల్లో పాల్గొన్నారు. ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుంటు పరస్పర హోలీ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.హోలీ పండగ సందర్భంగా దుకాణాదారులు, విద్యార్థులు,యువకులు, వివిధ పార్టీ నాయకులు, కార్యకర్తలు హోలీ సంబరాల్లో మునిగి తేలారు. యువకులు, విద్యార్థులు వీధుల్లో కలి యతిరుగుతు స్నేహితులు బంధువులపై రంగులు చల్లుకున్నారు. మహిళలు, యువతులు సైతం రంగునీల్లు చల్లుకుంటు హోలీ సంబరాలు జరుపుకున్నారు. మండలంలోని వివిద గ్రామాలలో హోలీ సంబరాలనుఅనందోత్సవాలతో జరుపుకున్నారు.ఇదిలా ఉండగా హోలీసందర్భంగా ఎలాంటి న్యూసెన్స్ జరుగకుండా స్థానిక ఎస్సై రాజశేఖర్ అద్వర్యంలో పోలీసులు పర్యవేక్షించారు.

ఎడపల్లి: ఎడపల్లి మండలంలోని జానకంపేట, జంలం, బ్రాహ్మణ్‌పల్లి, జైతాపూర్, ధర్మారం గ్రామాలలో ఆదివారం హోలీ పండుగను ఘనంగా నిర్వహించుకున్నారు. అనవాయితీ ప్రకారం సార్‌గామ ఉన్న గ్రామాలలో ఒకరోజు ముందు హోలీ పండుగను నిర్వహిస్తారు. అందులో భాగంగా ఆయా గ్రామాలలో శనివారం కామ దహనం చేసి ఆదివారం హోలీ పండుగను జరుపుకున్నారు. మండలంలోని మిగతా గ్రామాలలో ఆదివారం కామ దహనం చేసి సోమవారం హోళీ పండుగను జరుపుకుంటారు. హోళీ వేడుకల్లో రసాయన రంగులకు తావీయకుండా చిన్న, పెద్ద తేడా లేకుండా ఒకరినొకరు రంగులు చల్లుకుంటూ హోళీ పండుగను ఘనంగా జరుపుకున్నారు.

డొంకేశ్వర్: డొంకేశ్వర్ మండల కేంద్రంతో పాటు గాదేపల్లి, నడ్కుడ, నూత్‌పల్లి, నికాల్‌పూర్, తొండాకూర్, మారంపల్లి గ్రామాలలో ఆదివారం పిల్లలు, పెద్దలు, యువకులు రంగులు చల్లుకుంటూ హోలీ సంబరాలు జరుపుకున్నారు. యువకులు బైక్‌లపై తిరుగుతూ తోటి స్నేహితులకు రంగులు చల్లుకుంటూ హోలీ పండగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

ఆర్మూర్‌రూరల్: ఆలూర్ మండలంలోని వివిధ గ్రామాలలో ఆదివారం హోలీ పండగను ఘనంగా జరుపుకున్నారు. శనివారం రాత్రి ఆయా గ్రామాల్లో కమదాహన నిర్వహించడంతో ఆదివారం హోలీ పండగ సందర్భంగా చిన్నారులు, పెద్దలు ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుంటూ ఆనందోత్సవల మధ్య సంబరాలు జరుపుకున్నారు. మండలంలోని ఆలూర్, దేగాం, మచ్చర్ల తదితర గ్రామాల్లో యువకులు ఉత్సహంగా హోలీ సంబరాల్లో పాల్గొన్నారు.

నందిపేట: మండల కేంద్రంతో పాటు బజార్‌కొత్తూర్, దత్తాపూర్, నందిపేట, శాపూర్ తధితర గ్రామాల్లో ఆదివారం హోలీ నిర్వహించారు. శనివారం రాత్రి పలు చోట్ల గ్రామస్తులు కామ దహనం చేశారు. మరుసటి రోజు చిన్న పెద్ద, యువతీ యువకులు తేడా లేకుండా రంగులు చల్లుకున్నారు. యువజన సంఘాల సభ్యులు విద్యార్థులు బైక్ ర్యాలీలు నిర్వహించారు. అంతే కాకుండా అక్కడక్కడ డీజేలు ఏర్పాటు చేసి డ్యాన్సులు చేశారు. రంగులు చల్లుకోవడమే కాకుండా తలలపై కోడి గుడ్లు కొట్టుకున్నారు.మాంసం వంటలు చేసుకొని ఆరగించారు. కొందరు కులవృత్తుల ప్రజలు హోలీ పండగ సందర్భంగా ఇనాం(ఉల్పా) వసూళ్లు చేశారు.

జక్రాన్‌పల్లి: మండలంలోని వివిధ గ్రామాల్లో ఆదివారం హోలీ పండగను యువకులు,ప్రజలు, చిన్నారులు,మహిళలు ఘనంగా జరుపుకున్నా రు. మండలంలోని వివిధ గ్రామాల్లో సార్గమ్మ ఉన్న గ్రామాల్లో శనివారం కామ దహనం నిర్వహించగా ఆదివారం హోలీ పండగను ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. మహిళలు,యువకులు, చిన్నారులు,రంగులు చల్లుకుంటూ ఉత్సహంగాజరుపుకున్నారు.సోమవారం హోలీ సంబురాలు నిర్వహించను న్నారు.

ముప్కాల్:మండల కేంద్రంతో ఆయా గ్రామాల్లో హోలీ సంబరాలను యువకులు ఘనంగా జరుపుకున్నారు. శనివారం ప్రధానవీదుల్లో కామదహనం నిర్వహించడంతో ఆదివారం ఉదయం యువకులు, విద్యార్థులు ఒకరినొకరు రంగులు చల్లుకుంటూ ఉత్సహంగా జరుపుకున్నారు...

● బాల్కొండ పోలీస్‌స్టేషన్‌లో

బాల్కొండ పోలీస్‌స్టేషన్‌లో సిబ్బంది హోలీ సంబరాలు ఘనంగా జరుపుకున్నారు. ఒకరినోకరు రంగులు చల్లుకుంటూ సంబరాల్లో ఉత్సహంగా గడిపారు.ఈసందర్భంగా ఎస్సై గోపి మండల ప్రజలకు హోలీశుభాకాంక్షలు తెలిపారు.



ఎడపల్లిలో హోలీ పండుగను జరుపుకుంటున్న చిన్నారులు



డొంకేశ్వర్‌లో హోలీ సంబరాలలో యువకులు



జక్రాన్‌పల్లిలో రంగులు చల్లుకుంటున్న యువకులు

హజ్ యాత్రికులకు కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుంది



మాట్లాడుతున్న ప్రభుత్వ సలహాదారుడు షబ్బీర్‌అలీ

నిజామాబాద్ అర్బన్, మార్చి 24: హజ్ యాత్రికులకు కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుందని మక్కాలో కూడా ఇక్కడి నుంచి వెళ్లిన వారికి ప్రత్యేక సదుపాయాలు ఏర్పాటు చేస్తోందని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు మహ్మద్ అలీ షబ్బీర్ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని జిల్లా హజ్ సొసైటీ మౌలానా సయ్యద్ హ బీద్ ఖాస్మీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రెండో హజ్ శిక్షణ క్యాంప్‌ను ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది హజ్‌కు వెళ్లే యాత్రికుల కోసం ఈ శిక్షణ శిబిరాన్ని ఏర్పాటు చేశామన్నారు. హజ్ యాత్ర సన్నాహాల గురించి, వారి సందేహాలను నివృత్తి చేశారు. బోధన్ రోడ్‌లోని ఎన్ఎం ఫంక్షన్ హాల్‌లో ఈ శిక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఉర్దూ అకాడమి చైర్మన్ తాహెర్‌బిన్ హందాన్, తారిక్ అన్సారి, హజ్ కమిటీ చైర్మన్ ఖుస్రో పాషా తదితరులు పాల్గొన్నారు. సాయంత్రం నగర కార్పొరేటర్ అరోన్‌ఖాన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో షబ్బీర్ అలీ తదితరులు పాల్గొన్నారు.

రామ మందిర నిర్మాణానికి విరాళాలు

వర్ని,మార్చి24: వర్ని మండలం జలాల్‌పూర్ గ్రామంలో నిర్మాణంలో గల శ్రీరామ మందిరం నిర్మాణం కోసం భక్తుల విరాళాలు కొనసాగుతున్నాయి. ఆదివారం బొడ్డు శ్రీకాంత్ రూ.21,116, అందే వీరప్పలు తమవంతు సహకారంగా మందిర కమిటీ సభ్యులకు విరాళంను అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ సాయాగౌడ్, సింగంపల్లి సురేందర్, నరెడ్ల బాబు, రామాగౌడ్ పాల్గొన్నారు.

'బాజిరెడ్డిని ఎదుర్కొనే శక్తి అర్వింద్‌కు లేదు'

సుభాష్‌నగర్, మార్చి 24: నిజామాబాద్ జిల్లాలో గోవన్న అంటే బ్రాంట్ అని గోవర్ధన్‌ను ఎదుర్కొనే సత్తా అరవింద్‌కు లేదని బీఆర్ఎస్ నగర పార్టీ అధ్యక్షుడు సిర్పరాజు అన్నారు. జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ నిజామాబాద్ పార్లమెంట్‌లో అన్ని నియోజకవర్గాల్లో బాజిరెడ్డి గోవర్ధన్‌కు ప్రజల అండదండలు ఉన్నాయని అన్నారు. బాజిరెడ్డి ప్రజల నుంచి వచ్చిన వ్యక్తి అని అన్నారు. ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండే గోవర్ధన్ ఎప్పుడు అందుబాటులో ఉంటాడో తెలియని ధర్మపురి అర్వింద్‌కు ఎంతో వ్యత్యాసం ఉందన్నారు. నిజామాబాద్‌లో మోదీ మంత్రం పనిచేయదన్నారు. అనంతరం ఇందల్వాయి ఎంపీపీ రమేష్ నాయక్ మాట్లాడుతూ బాజిరెడ్డి గోవర్ధన్ ప్రజల మనిషి అని అన్నారు. ప్రజాక్షేత్రంలో ఉంటూ ప్రజల సమస్యల సమస్యలు పరిష్కరించే గొప్ప నాయకుడు అన్నారు. ఎంపీ అర్వింద్ అబద్దాల హామీలు ఇచ్చి ఒక్కసారి గెలిచాడని ప్రస్తుతం అర్వింద్‌కు డిపాజిట్ రాదన్నారు. బాజిరెడ్డి జోలికి వస్తే సహించేది లేదని అన్నారు. దమ్మున్న లీడర్‌కు టిక్కెట్ ఇవ్వడంతో కాంగ్రెస్, బీజేపీలకు వణుకు పుట్టిందన్నారు. ఈ కార్యక్రమంలో రూరల్ మండలం జడ్పీటీసీ సుమలత, రూరల్ బీఆర్ఎస్ అధ్యక్షుడు మధుకర్‌రావు, నాయకులు నరేష్ నాయక్, హన్మంత్‌రెడ్డి, ప్రేమ్‌దాస్ నాయక్, కుంచాల రాజు, వైస్ ఎంపీపీ అన్నం సాయిలు, చింత మహేష్, ఆకుల తిరుమల్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నగర అధ్యక్షుడు సిర్పరాజు

గడ్కోల్‌లో కాగడాల ప్రదర్శన

సిరికొండ, మార్చి 24: భగత్‌సింగ్ వర్ధంతి సందర్భంగా సిరికొండ మండలం గడ్కోల్ గ్రామంలో ఆదివారం ఆగడాల ప్రదర్శన చేశారు. సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ ఆధ్వర్యంలో గ్రామంలో కాగడాలతో కార్యకర్తలు ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాస్‌లైన్ రాష్ట్ర కమిటీ సభ్యుడు రామకృష్ణ మాట్లాడుతూ విప్లవ యువ కిశోరాలు భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌లను నేటి యువతరం ఆశయాలను ఆదర్శంగా తీసుకోవాలని కోరారు. దేశం గర్వించదగ్గ ఉప్లవ వీరులని ఆయన కొనియాడారు. 23 ఏళ్ల చిరుప్రాయంలోనే దేశ స్వాతంత్ర ం కోసం చిరునవ్వుతో ఉరి కంబం ఎక్కి ముద్దాడిన యు ద్ధ వీరులన్నారు. బ్రిటిష్ వాళ్లను గడగడలాడించిన ముగ్గురు యువ కిశోరులు నిజమైన దేశభక్తులని అన్నారు. మతం అన్నది మనుషులను చీల్చే రాజకీయ క్రీడా అని చాటిన దీరులని ఆయన కొనియాడారు. నేడు దేశం మతోన్మాద ఉచ్చులో చిక్కుకున్నారని అన్నారు. ప్రజలు నిరుద్యోగం, అధిక ధరలు లాంటి సమస్యలను పరిష్కరించాలన్నారు. అందుకే ప్రజలంతా బీజేపీ పాలకులకు వ్యతిరేకంగా మతోన్మాదానికి వ్యతిరేకంగా పోరాడాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో రమేష్, దామోదర్, రమ, పుష్పలత, రమేష్, కిశోర్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

సెపక్ తక్రా రాష్ట్ర జట్టు కెప్టెన్‌గా జిల్లాక్రీడాకారిణి

సుభాష్‌నగర్, మార్చి 24:సెపక్ తక్రా తెలంగాణ సబ్ జూనియర్ బాలికల జట్టు కెప్టెన్‌గా జిల్లాకు చెందిన క్రీడాకారిణి లాస్య ప్రియ ఎంపికైనట్లు సెపక్ తక్రా జిల్లా కార్యదర్శి గాదారి సంజీవ్ రెడ్డి తెలిపారు. ఈనెల 25 నుంచి 30 వరకు కర్నాటక రాష్ట్రంలో జరిగే జాతీయ స్థాయి పోటీలో రాష్ట్ర జట్టు తరపున కెప్టెన్‌గా వ్యవహరించనుందని తెలిపారు. జిల్లాకు చెందిన ఆరుగురు క్రీడాకారులు రాష్ట్రజట్టుకు ప్రాతినిధ్యం వహిస్తున్నారని తెలిపారు. జిల్లా క్రీడాకారిణి రాష్ట్ర జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరించడం పట్ల జిల్లా సెపక్ తక్రా అధ్యక్షుడు కేశవేణు, ఉపాధ్యక్షులు దీపిక, లాట్ గంగారెడ్డి, సంయుక్త కార్యదర్శి మీసాల ప్రశాంత్, పలు క్రీడాసంఘాలు హర్షం వ్యక్తం చేశాయి.

ఘనంగా కామదహనం



కామదహనంలో పాల్గొన్న రూరల్ ఎమ్మెల్యే



గంగాస్థాన్‌లో..

నిజామాబాద్ రూరల్, మార్చి 24: హోలీ వేడుకలు రూరల్ మండలంలో ఘనంగా జరిగాయి. శనివారం రాత్రి కామదహనం నిర్వహించారు. ఆది వారం తెల్లవారుఝము నుంచే హోలీ పండుగ ప్రారంభమైంది. చిన్నా పెద్ద తేడా లేకుండా అందరూ రంగులు చల్లుకొని హోలీ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. కుల మతాలకు అతీతంగా అందరూ హోలీ వేడుకల్లో పాల్గొన్నారు. గూపన్‌పల్లిలో జరిగిన కామదహనం కార్యక్ర మంలో రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ ఆర్.భూపతిరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రూరల్ ప్రజలకు హోలీ శుభాకాంక్షలు తెలిపారు.గంగాస్థాన్‌లోఅశోకహెవెల్స్‌లో ఘనంగా కామదహనం నిర్వహించారు.

రుద్రూరు:రుద్రూరు మండల కేంద్రంలోని గాంధీ చౌక్ వద్ద శనివారం రాత్రి ఘనంగా కామ దహనం నిర్వ హించారు. ఆవుపేడతో తయారు చేసిన పిడికలు, ఆవు నెయ్యిలను ఉపయోగించి కామదహనం చేశారు. ప్రకృతి సి ద్ధంగా ఉన్న వస్తువులతో ఘనంగా కా మదహనం కార్యక్రమం నిర్వహిం చారు. ఈ కార్యక్రమంలో పతాంజలి సోషల్ మీడియా అధ్యక్షుడు డాక్టర్ విశ్వనాథ్ మహాజన్, మాజీసర్పంచ్ ఇందూర్ చంద్రశేఖర్, గ్రామపెద్దలు బచ్చురామ్ సేట్ గుప్త,మాజీ సొసైటీ చైర్మన్ పత్తిరాము, గ్రామ పురోహితులు నరేష్ మహారాజ్, ఆర్యవైశ్యసంఘంసభ్యులు పాల్గొన్నారు.

నవీపేట: నవీపేటలో ఆదివారం రాత్రి కామ దహనం నిర్వహించారు. స్థానిక చావిడి సమీపంలో కాముడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కామ దహనం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, యువకులు పాల్గొన్నారు. సోమవారం మండల కేంద్రంతో పాటు పలు గ్రామాలలో హోలీ పండుగ నిర్వహించనున్నారు.

చికెన్ ధరలు

రకం	: లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	: రూ.155	రూ.225	రూ. 265
వెన్‌కాబ్(కిలో)	: రూ.160	రూ.235	రూ. 275

బంగారం ధరలు

బిస్కెట్ (10 గ్రా.)	ఆర్నమెంట్(10 గ్రా.)	వెండి(10 గ్రా.)
రూ.68,000	రూ.62,700	రూ.785

సినిమా గైడ్ నిజామాబాద్

పీవీఆర్ మల్టీప్లెక్స్..

స్క్రీన్-1 : సైతాన్ (హిందీ) (12.50)
: ఓం భీమ్ భుష్ (3.50, 10.15)
: ప్రేమలు (7.00)
స్క్రీన్-2 : ప్రేమలు (1.30)
: కుంగుఫూ పాండా4 (ఇంగ్లీష్ 3డీ) (5.10, 7.30)
: సైతాన్ (హిందీ) (9.50)
స్క్రీన్-3 : యమధీరా (1.10)
: యోధా (హిందీ) (4.10)
: ఈరోజుల్లో (7.10)
: లైన్‌మెన్ (10.00)
స్క్రీన్-4 : రజాకర్ (12.05, 6.30, 9.45)
: గామి (3.20)

ఉషాప్రసాద్ మల్టీప్లెక్స్..

స్క్రీన్-1 : ఓం భీమ్ భుష్ (1.45, 7.30, 10.30)
: ప్రేమలు (4.30)
స్క్రీన్-2 : రజాకర్ (10.25, 4.30)
: భీమా (7.40)
: ప్రేమలు (10.30)
స్క్రీన్-3 : రజాకర్ (1.40, 10.40)
: లైన్‌మెన్ (7.35)

దేవి : ప్రేమలు (11.15, 2.15, 6.15, 9.15)
లలితమహల్ : ఓం భీమ్ భుష్ (11.15, 2.15, 6.15 9.15)
నటరాజ్ : నువ్వు నేను (11.15, 2.15, 6.15, 9.15)
విజయ్ : రజాకర్ (11.15, 2.15, 6.15, 9.15)

- నిజామాబాద్ అర్బన్